క్లుప్తంగా

25వ రోజుకు చేరిన వీఓఏల దీక్షలు



మక్తల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపడుతున్న దీక్షలు గురువారం 25వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గురువారం వంటవార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీటీసీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌రాంరెడ్డి సంఘం మద్దతు తెలిపి మాట్లాడారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, రమేష్, లక్ష్మయ్య, అంజి, నర్సింహులు, బాలయ్య, రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, వెంకట్రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

నర్వ: ఖమ్మం జిల్లా అశ్వరావుపేటలోని ఆయిల్‌పాం తోటలు, పరిశ్రమల సందర్శన, అక్కడి రైతుల అనుభవాలు తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి రైతులను విజ్ఞానయాత్రకు పంపిస్తుందని ఏఓ గణేష్‌రెడ్డి, ఏఈఓ వెంకట్రాములుగౌడ్ గురువారం తెలిపారు. ఆసక్తిగల రైతులు యాత్రకు వెళ్లేందుకు ఏఈఓల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

14న తీలేరులో హనుమాన్ జయంతి వేడుకలు



మరికల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 14న మండలంలోని తీలేరు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు హిందు ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాశాఖ నిర్వాహకుడు డా. ఉత్తరాపల్లి రామాచారి తెలిపారు. జిల్లాకు సంబంధించిన టీటీడీ సేవా కార్యక్రమాల బ్యానర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి టీటీడీ సేవాబృందం సభ్యుడు మాలె శ్రీరామ్‌కు అందజేశారు.

వ్యక్తి రిమాండ్‌కు..

మరికల్: ఓ కేసులో ముద్దాయిగా ఉన్న వ్యక్తి విచారణకు హాజరుకాకపోవడంతో నారాయణపేట కోర్టు న్యాయమూర్తి ఉమర్ గురువారం రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నారాయణపేట బీఎస్పీ ఇన్‌చార్జ్‌గా ఉన్న శ్రీనివాస్ 2021లో ఓ కేసులో ముద్దాయిగా ఉన్నారు. పలుమార్లు విచారణకు హాజరుకావాలని ఆదేశించినా రాకపోవడంతో గురువారం అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

కోస్గి: అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి డీకే రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. ఇలాంటి సమయంలో కోతలు విధించడం సరికాదన్నారు. అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేపట్టాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ఫ్లెక్సీ



మరికల్: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఓ భవనంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఈదురు గాలులకు విద్యుత్ స్తంభంపై పడటంతో ప్రమాదం పొంచి ఉంది. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో తీగలు తెగి ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని పట్టణవాసులు మండిపడుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఫ్లెక్సీని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్మికుడి ఆకస్మిక మృతి

బాలానగర్: పరిశ్రమల్లో పని వెదుక్కొనేందుకు వచ్చిన ఓ కార్మికుడు గురువారం ఆకస్మికంగా మృతిచెందినట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌లోని షాడోల్ జిల్లా భరతార్‌కు చెందిన పురుషోత్తం (35) మండలంలోని మోతీఘణాపూర్ శివారులోని పరిశ్రమలో పని నిమిత్తం బావ హతిరాంసింగ్‌తో కలిసి ఈ నెల 10న వచ్చాడు. గురువారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. హతిరాంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

ఉపాధి.. ఉత్సాహం

- మండలంలో జోరుగా కొనసాగుతున్న పనులు
- ఫాంపండ్స్, పశువుల షెడ్లు, వాలుకట్టల నిర్మాణాలకు రైతుల ఆసక్తి
- కొనసాగుతున్న మట్టి రహదారుల మరమ్మతులు

ఊట్కూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు అనేక పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రైతులు తమ పొలాల్లో ఫాంపండ్స్, వాలుకట్టల నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారు. గుట్టల పక్కన కందకాలు తవ్వుతున్నారు. మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో నెల రోజులుగా ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో 6,574 జాబ్‌కార్డులు ఉండగా.. 2,032 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. 23 నర్సరీల్లో 2.30 లక్షల మొక్కలు పెంచుతున్నారు. మండలంలోని ఊట్కూర్, పులిమామిడి, మొగ్దుంపూర్, ఎర్గాట్‌పల్లి, పులిమామిడి, తిప్రాస్‌పల్లి, నిడుగుర్తి, తిమ్మారెడ్డిపల్లితండా తదితర గ్రామాల్లో పనులు కొనసాగుతుండటంతో కూలీలకు ఉపాధి దొరుకుతుంది.



తిప్రాస్‌పల్లిలో కొనసాగుతున్న ఫాంపండ్ నిర్మాణం

ఫాంపండ్స్..

మండలంలో రైతులు తమ పొలాల్లో 8 8, 12 12, 20 20 గజల విస్తీర్ణంలో ఫాంపండ్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. పొలంలోని లోతట్టు ప్రాంతంలో వీటి నిర్మానం చేపట్టడంతో వర్షపు నీరు చేరి భూగర్భ జలాలు పెరగనున్నాయి.

సమతుల కందకాలు..

గుట్టల పక్కన సమతుల కందకాలు తవ్వుతున్నారు. పులిమామిడి రామలింగప్పగుట్ట చుట్టూ కందకం తవ్వారు. దీంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు కూలీలకు ఉపాధి లభిస్తుంది.



ఊట్కూర్ శివారులో పశువుల షెడ్డు



పులిమామిడి రామలింగప్పగుట్టపై తవ్వుతున్న కందకాలు

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధిహామీ పథకంలో పొలాల్లో ఫాంపండ్స్, వాలుకట్టలు, పశువుల షెడ్లు, గుట్టల ప్రాంతాల్లో కందకాలు తవ్వుకోవాలని సూచిస్తున్నాం. దీంతో భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల్లో సమృద్ధిగా నీరు లభిస్తుంది.

– కాళప్ప, ఎంపీడీఓ, ఊట్కూర్

కొలతల ప్రకారం కూలీ...



మండలంలో 2,032 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. కొలతల ప్రకారం కూలీ రూ.154 నుంచి రూ.252 వరకు చెల్లిస్తున్నాం. పశువుల షెడ్ నిర్మించుకుంటే రైతు ఖాతాలో రూ.78 వేలు జమచేస్తాం. ఫాంపండ్స్, పశువుల షెడ్లకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్‌లో చేపట్టే హరితహారం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేస్తున్నాం.

– చంద్రకంటి శ్రీనివాస్, ఈసీ, ఊట్కూర్

డైరెక్టర్ల ఎంపిక ఏకగ్రీవం



నియామక పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి లావణ్య

మక్తల్: స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలో భాగంగా డైరెక్టర్ల ఎంపిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి లావణ్య తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం చివరి తేది కాగా.. పలువురు సభ్యులు తమ నామపత్రాలను ఉపసంహరించుకోవడంతో తొమ్మిది మంది డైరెక్టర్ల ఎంపిక ఏకగ్రీవమైంది. డైరెక్టర్లుగా కోళ్ల వెంకటేష్, మామిళ్ల కిష్టప్ప, తిరుపతి, నర్సింహులు, చందాపూర్ శేఖర్, వల్లంపల్లి లక్ష్మణ్, కర్ని గోపి, వాకిటి శ్యామ్, సత్యమ్మ, వాకిటి పాపమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు దేవసూగురు సరేందర్, వాకిటి శ్రీనివాస్, వాకిటి బాబు, వాకిటి అంజయ్య, కావలి శ్రీహరి, మామిళ్ల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దాత వన్నాడ వెంకటప్ప దంపతులు

దామరగిద్ద: మండల కేంద్రంలో కట్టమీది ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత వన్నాడ వెంకటప్ప దంపతులు యంత్ర, ప్రాణ ప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి, మహాయజ్ఞం, హోమం, అభిషేకం మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వన్నాడ ఆశమ్మ, అంజప్ప, భీంరెడ్డి, సంజీవరెడ్డి, బస్వంత్‌రాజ్, వెంకటప్ప, చంద్రకాంత్, రవికుమార్, అంజప్ప, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గోపాల్‌రావు, నబి, మాణిక్, నారాయణ, మోహన్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న గోపాల్

దామరగిద్ద: ఉపాధిహామీ కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. గురువారం మండలంలోని మద్దెల్‌బీడ్‌లో ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలను కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి క్రమంగా నిధులు తగ్గించి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలతలతో కూలీ గిట్టుబాటు కావడం లేదని.. రోజుకు రూ.600 చొప్పున కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కూలీలు తిరుపతిరెడ్డి, లక్ష్మయ్య, రాజు, వెంకటయ్య, సరోజనమ్మ, లక్ష్మి, అనంతమ్మ పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మాణం పరిశీలన



సీసీ రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నర్వ: మండలంలోని ఎల్లంపల్లిలో కొనసాగుతున్న సీసీ రహదారి నిర్మాణాన్ని గురువారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ. 10 లక్షలతో పనులు చేపడుతున్నామని.. నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు నాణ్యతగా చేపడితేనే గ్రామంలో ప్రజల మన్ననలు పొందవచ్చన్నారు. ఆయన వెంట ఎంపీపీ జయరాములుశెట్టి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, సర్పంచ్ చెన్నప్ప, ఉప సర్పంచ్ నాగరాజు, నాయకుడు దండు అయ్యప్ప తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే..



గేట్‌వాల్ ఉన్న గుంతను పూడ్చకుండా వదిలేసిన ప్రాంతం

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలోని ఆరో వార్డులో నూతనంగా సీసీ రహదారిని నిర్మించిన అధికారులు, ప్రజాప్రతినిధులు రహదారి పక్కన ఉన్న తాగునీటి పైప్‌లైన్ గేట్‌వాల్‌ను విస్మరించారు. గుంతల మధ్య గేట్‌వాల్ ఉన్న ప్రదేశాన్ని వదిలి మిగిలిన ప్రదేశంలో రహదారిని నిర్మించారు. దీంతో పగటి పూటనే ద్విచక్ర వాహనదారులు ఆ గుంతను అంచనా వేయలేక కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. శాశ్వత రహదారి నిర్మించిన అధికారులు గేట్‌వాల్‌కు సైతం రింగులు వేసి మిగిలిన ప్రదేశంలో సీసీ రహదారి వేస్తే గుంతలు ఉండవని కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటార్ రాజేశ్వర్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న గేట్‌వాల్‌కు రింగులు అమర్చి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

కలెక్టర్ అభినందన



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కోస్గి: పట్టణంలోని వేద ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయి శివాని, వైష్ణవి పదోతరగతిలో 10 జీపీఏ సాధించారు. గురువారం కలెక్టర్ శ్రీహర్ష తన కార్యాలయంలో విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నారాయణపేట: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ కానిస్టేబుళ్లు సూచించారు. గురువారం జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. రాష్ డ్రైవింగ్ చేయరాదని, వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, సామర్థ్యానికి మించి ప్రయాణించరాదని, మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు. రహదారిపై ఉన్న సైన్ బోర్డ్స్ గమనిస్తూ వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్స్ తిరుపతి, దేవేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల తరలింపులో నిర్లక్ష్యం



అమరచింతలో వీధి కుక్కల సంచారం

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో వీధి కుక్కల దాడుల్లో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా కుక్కల తరలింపునకు మున్సిపాలిటీ అధికారులు శ్రీకారం చుట్టినట్టే చేసి ప్రస్తుతం వెనక్కి తగ్గారు. దీంతో మరోమారు పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను పట్టుకొని తరలించడానికి నెల్లూరుకు చెందిన రెండు ప్రత్యేక బృందాలను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా రప్పించారు. రెండు రోజుల పాటు 190 కుక్కలను పట్టుకున్నామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. పట్టణంలో పూర్తి స్థాయిలో కుక్కలను తరలిస్తామని ప్రకటించిన అధికారులు.. ప్రస్తుతం కుక్కల తరలింపును నిలిపి వేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల తరలింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

15 నుంచి మండలస్థాయి ఆటల పోటీలు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయి ఆట పోటీలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల లోపు ఉన్న యువత పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో 12,13 తేదీల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గెలిచిన వారిని జిల్లా స్థాయిలో.. అక్కడి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

గార్లపహాడ్‌ను మండలం చేయాలి



గార్లపహాడ్‌లో చేస్తున్న దీక్షలో జేఏసీ నాయకులు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలం చేసేందుకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని మండల సాధన సమితి కన్వీనర్ రామునాయక్, కో–కన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. 15 గ్రామాల ప్రజల మద్దతుతో 111 రోజులుగా దీక్షలు చేస్తున్నా.. ఎమ్మెల్యేకు కనిపించకపోవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణే సమస్యకు పరిష్కారం



రంగుల ముగ్గులు వేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): క్రమబద్ధీకరణే సమస్యకు పరిష్కారమని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. స్థానిక ధర్నాచౌక్‌లో జేపీఎస్‌లు చేపడుతున్న నిరసన దీక్ష గురువారం 14వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా చేపట్టే విధులను వివరిస్తూ ముగ్గులు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విధులకు హాజరుకాకుంటే తొలగిస్తామంటూ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని.. విధుల్లో చేరాలని మండల అధికారులు వత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కార్యదర్శులు విధుల్లో చేరుతున్నారని అసత్య ప్రచారం చేస్తూ మనోధైర్యాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లో లొంగమని తేల్చి చెప్పారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వెంకటేశ్ చౌహాన్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతు తెలిపి ప్రసంగించారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి లక్ష్మీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు పాండు, రవి, రఘుపతిరెడ్డి, నర్మద, శిరీష, రాఘవేందర్‌గౌడ్, హాజీ, వెంకట్రాములు, రాకేష్, వెంకటేశ్, మణి, సరస్వతి, శ్రీలత, పూర్ణిమ, ప్రవళిక పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

దేవరకద్ర: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెంలో రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి ఆర్‌ఎన్‌ఆర్ 15038, కేపీఎస్‌ఎమ్ 1638 రకం విత్తనాలు కిలో రూ.44 (20 కిలోల బస్తాలు), వేరుశనగ కె–6, నిత్యహరిత రకం విత్తనాలు కిలో రూ.108 (30 కిలోలు), తెల్లజొన్న సీఎస్‌వీ 31, సీఎస్‌వీ 41 రకం విత్తనాలు కిలో రూ.90 (3 కిలోలు) పచ్చజొన్న పీవీపీఎస్–2 రకం విత్తనాలు కిలో రూ.150 (3 కిలోల బస్తాలు)చొప్పున విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవే గాక కంది, మినుము, ఆముదం, రాగుల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, వానాకాలం పంటలు వేసుకొనే రైతులు ముందుగానే తీసుకెళ్లాలని వివరించారు.

మండల సాధనే ధ్యేయంగా పోరాటం



మాట్లాడుతున్న ఎం.హన్మేష్‌చారి

నారాయణపేట: కోటకొండ ప్రాంత అభివృద్ధిని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కాంక్షిస్తే వెంటనే ప్రభుత్వంతో మండలంగా ప్రకటించాలని లేదంటే ఎందుకు చేయరో చెప్పాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ఎం.హన్మేశ్‌చారి ప్రశ్నించారు. కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో కోటకొండ గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర రిలే దీక్షలను గురువారం రెండోరోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో కొత్త మండలాలు ఏర్పడగా నారాయణపేటలో ఎందుకు కావడం లేదని.. ఎమ్మెల్యే తలచుకుంటే సాధ్యమవుతుందని తెలిపారు. కోటకొండను మండలం చేసే వరకు ప్రతి ఒక్కరూ దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండలం సాధిస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని.. మరిన్ని సౌకర్యాలు కలుగుతాయని వివరించారు. అదేవిధంగా ప్రజాపంథా జిల్లా కార్యదర్శి బి.రాము, బీజేపీ రాష్ట్ర నాయకుడు కెంచె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి మండల సాధన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు జెండాలు పక్కనబెట్టి మండల సాధనే ధ్యేయంగా పని చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం కలిసి రావాలన్నారు. రెండోరోజు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా కోటకొండ గ్రామ కమిటీ దీక్షలో కూర్చొంది. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, సీపీఎం నాయకులు బలరాం, దస్తప్ప, బీజేపీ నాయకులు సాక ప్రవీణ్, గొల్ల చెన్నప్ప, పేట మోహన్, ప్రజాపంథ నాయకులు యాదగిరి, వెంకట్రాములు, హాజీ, రాములు, సౌజన్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుకు ఆసక్తి

- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు
- పోషకాలు, దిగుబడి ఎక్కువే
- రసాయన ఎరువుల వినియోగంతో భూమి నిస్సారం



బైరంపల్లి సమీపంలో ఓ రైతు పొలంలో వేస్తున్న సేంద్రియ ఎరువు

మాగనూర్: పొలాల్లో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం పరిమితి మించడంతో రైతులకు ఆర్థిక భారంతో పాటు భూములు నిస్సారమవుతున్నాయి. ఈ క్రమంలో రైతుల చూపు సేంద్రియ సాగుపై పడింది. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరగడంతో అధిక ధర పలుకుతుంది.

మొక్కలకు అవసరమైన పోషకాలు..

సేంద్రియ ఎరువుల్లో మొక్కలకు అవసరమైన అనేక పోషకాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గేదె మూత్రంలో నత్రజని, పొటాష్, కొద్ది మొత్తంలో భాస్వరం ఉంటాయని.. దీన్ని పంటకు వాడవచ్చని స్పష్టం చేస్తున్నారు.

పెరిగిన ధరలు..

డిమాండ్ పెరగడంతో గతంలో లారీ కోడి ఎరువు రూ.9 వేలలోపు ఉండగా.. ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు పలుకుతుంది. అలాగే పశువుల ఎరువు లారీకి రూ.12 వేలలోపు ఉండగా.. ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ. 16 వేలకు పైగా చేరింది. గొర్రెల ఎరువు సైతం గతంలో రూ.7 వేలలోపు ఉండగా.. ప్రస్తుతం రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంది. సీజన్‌లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

సేంద్రియ సాగే మేలు..



రసాయన ఎరువుల వినియోగంతో పెట్టుబడి పెరగడంతో పాటు పంటలో పోషక విలువలు తగ్గుతున్నాయి. సేంద్రియంగా సాగుచేసిన ధాన్యం తింటే ఆరోగ్యంగా ఉంటాం.

– కుర్వ శేఖర్, రైతు, బైరంపల్లి

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి..



రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలి. అప్పుడే అధిక దిగుబడులతో పాటు మంచి పంట వస్తుంది.

– హరిత ఏఓ మాగనూర్.